# లోపలి లోకాలు

"ఓయబ్బో! పెద్ద పూలతోట తయారు సేసేత్తన్నాడు దొరనాగ—

పూలమొక్కలకి గొప్పులు తవ్వుతున్న రామయ్యను చూసి నవ్వుతూ అంది నీలాలు నెత్తిమీది గడ్డిమోపు క్రిందికి పారేస్తూ—

రామయ్య తలెత్తి నీలాల్ని చూసి నవ్వాడు.

"పూలతోటేసుకుంటానికి దొరలు కావాలంటే? భూమి తల్లికి అందరూ ఒకటే! అందరికి ఓలాగే పూస్తది-కాస్తది."

"ఇయ్యేం మొక్కలు మావా!"

"ఏటయ్యోనే! రాజారావు బాబుగారిచ్చినారు. పట్నంనుండి తెప్పించినారంట!—

"అంతంత గొప్ప మొక్కలన్నీ నీ కెందుకు మావా?"

"నాక్కాకపోతే ఎవడిక్కావాలే? మన మనువయిపోయినాక ఈ పూలన్నీ నీ తల్లో సింగారించటానిక్కాదూ ఈ పేత్రిమంతా."

నీలాలు సిగ్గుల మొగ్గయింది.

"నిజంగా నా కోసవేనా మావా, ఈ ప్రేమంతా?" మురిపెంగా అడిగింది.

"ఏడిసావ్! నీ కోసం కాదు."

నీలాలు మూతి ముడుచుకుంది.

"మరెవరి కోసవేటి?"

"మనకోసం!"

నీలాలు కిలకిల నవ్వింది.

"అల్లరి మావ!"

"ఇదిగోనే! ఈ సన్నజాజి తీగ చూసావా? పందిరి మీదకు పాకింది. సరింగా కిటికీపక్క వేశాసు. ఆటి సువాసనంతా మన గదిలోనే ఏయ్! బాగుందా?"

నీలాలు ముఖం తిప్పుకుని "సీ, పో" అంటూ పోయింది.

పోబోతున్న దాని కొంగు పట్టుకుని కిందపడేశాడు రామయ్య—

"ఏటి మావా! అల్లరి....పోవాలి! వదులు" అంది నీలాలు కొంచెమైనా రామయ్య చేతులలోంచి కదలకుండా-

"పోయి ఏటి సేస్తావే? యింకెన్నాల్లు-వచ్చే పున్నానికల్లా లగ్గం పెట్టేతారంట శాత్రిలుగారు..." నీలాలు నీలాల్లాంటి కళ్ళలోకి తమకంతో చూస్తూ అన్నాడు రామయ్య.

"మరి—మావా—?"

నీలాలు ఆగిపోయింది.

"ఏటే!"

"మా అయ్య—"

"మీ అయ్య సంగతి తెలుసులేవే. ఈ సక్కని సుక్కకి రెం డొందలేనా ఓలి పెట్టాలని కూసున్నాడు-ఇత్తాలే."

"ఏడది మావా!"

"రాజారావు బాబు ఇత్తానన్నాడే. దరమరాజు. ఎంత పున్నెం పేసుకున్నానో, ఆ బాబు పొలంలో సెయ్యటానికి—"

"మా అయ్య ఆసకి అంతులేదు మావా"

"ఏం నాబవే! ఎక్కడలేనిదీ తాగి తందనాలాట్టానికేగా! సంపా దింసిందంతా దాసిపెడితే, ఈపాటికి సొంతపొలం కొనేవాడు కాదంటే మీ అయ్య."

నీలాలు భారంగా నిట్టూర్చింది.

"నిజం మావా! ఒక్క మా అయ్యేంటి, ఈడందరూ ఆ కల్లు ముంతల యెదానేత్తున్నారు గడిసిందంతా—"

"మా అయ్యా తాగేవోడే! తాగొచ్చి మా అమ్మని గొడ్డును బాది నట్టు బాదేవోడు—సివరికి ఆడి సేతుల్లోనే సచ్చింది మా అమ్మ" చూస్తుం డగానే రామయ్య కళ్ళు ఎర్రగా అయిపోయి; పిడికిళ్ళు బిగుసుకు పోయాయి.

నీలాలు హడిలిపోయింది.

"నీలాలూ ఒక్కమాటే! తాగేవోళ్ళంటే పరమ అసయ్యం నాకు ఆల్ల ముకమైనా చూడను. పసువులు-పసువు లవుతారే తాగి—"

రామయ్య కళ్ళలోని తీవ్రమైన ద్వేషానికి బెదిరిపోయి చూస్తోంది నీలాలు. సమాధానం చెప్పటంకూడా మరిచిపోయి—దాని బెదురు చూపు లకు నవ్వుకున్నాడు రామయ్య.

దాని సిరసు పే్రమగా నిమిరాడు.

"నీలి! ఒక్కోడాది కూసింత కష్టపడాలే! నాలుగురాల్లు యెనకేసుకుని సొంత పొలం కొనుక్కోవాలే. బాగా కష్టపడి ఆ పొలం పదింతలు చేసుకోవాలే, మన బిడ్డలు మనలాగా కవులుదార్లు కాకూడదే నీలి. ఆల్లు సొంతపొలం సేసుకునే రైతులవ్వాల!"

భావి బంగారు కలలు రామయ్యని వరిస్తాంటే మైమరచిపోతోంది నీలాలు.

"కష్టపడదాం మావా! నానుకూడా కూలికెల్తానుగా! ఆ డబ్బులన్నీ నీకే యిత్తాను."

"ఛీ, నువ్వు కూలి కెల్లటవేటే! నీ బాబు ననుకున్నావా ఆడదాని సొమ్ము మీన బతకటానికి. నిన్ను పువ్వుల్లోపెట్టి సూసుకుంటానే నా రాసీ! కష్టవంతా నేనే సేత్తాను. నీ నవ్వుల్లో నా కష్టవంతా మాయమవుద్ది - అది సర్లేగాని కూలంటే గురుతుకొచ్చినాది ఆ నాయుడేంటే కూత్తన్నాడు మద్దినాల!"

నీలాలు కళవెళ పడిపోయింది.

"ఏం నేదు మావా! ఏదో వాగబోయినాడు. అప్పుడే పెట్టాలే- తలవాసేలా సీవాట్లు-"

"సీవాట్లుగాదే నీలీ - ఆడికి సెప్పు - ఇంకోపాలి నీ జోలికొత్తే ఆడి పానాలు దక్కవని సెప్పు. రామయ్య మావ సెప్పమన్నాడని సెప్పు. దొంగనాయాల - నీ కొంగట్టుకుంటాడా!"

రామయ్య కళ్ళలోంచి నిప్పులు కురుస్తున్నాయి. "మావా!" అంటూ భయంగా కౌగలించుకుంది నీలాలు.

"భయంనేదే నీలీ ! ఈ రామయ్యుండగా నీకు భయంనేదు. నే నెంత మంచోణ్ణో అంత చెడ్డోణ్ణి. నీసీద తొక్కినోళ్ళ పేనాలు అక్కడే పాతేత్తాను."

ఆప్యాయంగా నీలాలు వెన్ను నిమిరాడు.

"మావదంతా సిత్తం - ఎన్నంటి మనసు. అంతలో రాచ్చసు డిలా అయిపోతాడు" అనుకుంది నీలాలు.

"వత్తాను మావా ! మా అయ్య సూత్తుంటాడు." రామయ్య కళ్ళ లోకి నవ్వి చేతుల్లోంచి దూసుకుంటూ వెళ్ళిపోయింది నీలాలు.

"నీలాలూ ! నాకో పని సెయ్యాలే !" నాలుగు రోజులు పోయాక అడిగాడు రామయ్య.

"సెప్పు మావా ! నీ కోసం ఏటి సెయ్యను నేను ?"

"మా రాజారావుగారింటి కాడ పాసిపనిసేసే అప్పికి జొరం తగి లిందే. కాత్త ఆరింటికాడ పనిసెయ్యాలే. ఆ బాబు ఇబ్బందిపడుతున్నారు"

"తూ, నేను పాసిపనుల కెల్లను మావా, పొలం పనులే సాలు నాకు."

"నీలీ ! నా మాటినవే. ఆ యయ్య దరమరాజే. పోనీ, నాలుగు రోజులేగదే, దానికి జొరం మల్లగానే అదే వస్తది."

"సరే మావా ! ఆరింటో ఆడాళ్ళు లేరు అందుకే బయ్యం."

మనిసి గునంలో ఉంది కాని, ఆడాల్లుంటేనేం, లేకపోతేనేవే ? రంజలాంటి పెల్లానెట్టుకొని నాయుడు కావెకిలి సావాసాలేటి ?"

నాయుడి పేరెత్తుతేనే భగ్గుమంది రామయ్యకి.

"సరేమావా ! ఎల్తాలే."

రామయ్య కళ్ళలో మమకారాన్నే కాని, ఎఱ్ఱజీరల్ని చూడలేని నీలాలు వెంటనే ఒప్పేసుకుంది.

రెండు మూడు రోజులు బితుకు బితుకుమంటూ వెళ్ళింది నీలాలు రాజారావుగారింటికి.

కానీ. రాజారావు ఎప్పుడూ తన పుస్తకాల్లో మునిగిపోయి, తను ఉన్నదీ లేనిదీకూడా గమనించకపోవడంతో నీలికి నిశ్చింత అయిపోయింది. అదికూడా రాజారావును "దరమరాజు" అనుకుంది మనసులో.

రామయ్య నీలి తండ్రికి రెండొందలూ ఓలికట్టి నీలికి పసువు, కుంకం, పూలు, పళ్ళు పెట్టి మనువు నిశ్చయం చేసుకున్నాడు. నీలితో కలిసి రాజారావుకి నమస్కారం చేశాడు. రాజారావు వాళ్ళిద్దరిని మనసారా దీవించి నీలాలికి చీరా, రెవికా, రామయ్యకి పంచె, చొక్కా కొనిచ్చాడు.

నీలాలు ఎంతో మురిసిపోయింది. రామయ్య పొంగిపోయాడు.

శాస్త్రిలుగారు ముహూర్తం పెట్టారు. ఇంకొక్క వారంరోజుల్లే ఉంది పెళ్ళి. నీలాలు మనసు ఉత్సాహంతో ఉరకలు వేస్తోంది. ఏ పని చేస్తోన్నా మనసు పగటికలల్లో తేలిపోతోంది. ఇల్లు ఊడుస్తూ ఊడుస్తూ కిటికీలోంచి బయటికి చూసింది. కిటికీమీదకి ఎగబ్రాకుతున్న సన్నజాజి తీగె కనిపించింది. వెంటనే రామయ్య ఇంటిముందు సన్నజాజి తీగె దాన్ని పాతుతూ రామయ్య అన్న మాటలు గుర్తుకొచ్చాయి. చేతిలోంచి చీపురు జారిపోయింది.

కిటికీ ఊచలకి తల ఆనించుకొంది. కళ్ళు అరమోడ్పులయ్యాయి. పైట జారిపోయింది.

ఏదో పనిమీద ఆ గదిలోకొచ్చిన రాజారావు కళ్ళు ఆ మూర్తిని చూడగానే చెదిరిపోయాయి. అడుగు ముందుకు పడలేదు. "నీలాలూ!" అన్నాడు కంపిస్తోన్న స్వరంతో.

పగటికలల్లోవున్న నీలాలుకు ఆ పిలుపు వినిపించలేదు.

పైటలేని నీలాల్ని చూడలేక పోయాడు రాజారావు. చటుక్కున దగ్గరగా వెళ్ళి దాని పైట దాని వంటిమీద వెయ్యబోయాడు.

తనను తను మరిచి రాబోయే దాంపత్యపు జీవితపు రోజులను తలచుకొంటూన్న నీలాలు శరీరం రాజారావు చెయ్యి పడగానే పులకరించి పోయింది.

అంతే—

నీలాలు వెక్కి వెక్కి ఏడుస్తూ తనముందు కుప్పకూలిపోయాక కాని రాజారావుకి తెలివి రాలేదు.

తనను తను అసహ్యించుకున్నాడు. బాధగా జుట్టు రెండు చేతులతో పీక్కున్నాడు. ఏం చేసినా జరిగిపోయినదాన్ని తుడిచివెయ్యగలిగే శక్తి ఎవరికీలేదు. అతనికీ లేదు. వణుకుతున్న చేతులతో వందరూపాయల కాగితం తీసి నీలాలు కందించాడు. నీలాలు ఆ నోటుకేసి పిచ్చిగా చూసింది. గభాలున ఆ నోటు లాక్కుని శివమెత్తినదానిలా పరుగెట్టింది సరాసరి కల్లుదుకాణం చేరుకుంది.

తనచుట్టూ చేరిన వాళ్ళందరికీ కల్లుముంత లందిస్తోన్న సోవమ్మ నీలాల్ని విస్తుపోయి చూసింది.

"ఏంటే పిల్లా ఇటొచ్చినావ్! మీ రామయ్య చూసినాడంటే నిన్నూ నన్నూకూడా తవ్వి పాతేస్తాడు—"

నీలాలు తన చేతిలోవున్న వందరూపాయల కాగితం సోవమ్మ మీదకు విసిరేసింది.

"పొయ్యత్తా! కల్లుపొయ్యి" అంటూనే ఓ ముంత అందుకుని గడ గడ తాగటం మొదలుపెట్టింది.

వందరూపాయలు చూడగనే సోవమ్మ కళ్ళు మెరిశాయి. చటుక్కున అ కాగితం బొడ్లో దాచేసుకుంది _ నీలి తాగుతోంది.

ఇంకా—ఇంకా—చటుక్కున ఎవ్వరో పోలీసులు అన్నారు. అంతే - కొన్ని క్షణాల్లో ఆ కల్లుదుకాణం సోడా దుకాణంగా మారి పోయింది. నీలి తప్ప మిగిలినవారంతా మాయమయి పోయారు. "పోయే, నీలీ లోపలికి పో. పోలీసు లొత్తన్నారు, నీ దుంపతెగా!"

నీలి కదల్లేదు—

"ఇంకోముంత .." అంటొంది మత్తుగా

సీ నీ మొహం యీడచ! పోయే లోపటికి పో! ఆ పోలీసు చచ్చినోల్లు పోయాక తాగుదువుగాని పో! నీలి కదల్లేదు—

"ఇంకోముంత ఇంతలో పోలీసులు రానే వచ్చారు— "ఏమే తాగావా? నీలిని గదమాయించి అడిగారు. నీలి విరగబడి నవ్వింది.

"తా గ లే దు _ తా గా లి. ఇయ్యి సోవమ్మా ఇంకో ముంతియ్యి—

చెయ్యి ముందుకు జాపింది నిలువెల్లా వణికిపోతూ.

"ఏం సోవమ్మా?" అని పోలీసులు అనీ అనగానే సోవమ్మ ఏడ్చినంత పని చేసింది.

"బాబ్బాబు! సోడాలమ్ముకుని బ్రతికేదాన్ని. ఈ లంజ ఏదో తాగి ఈ అల్లరి పెడతన్నాది. ఎవరికి తెలియదేటి?" అంటూనే యిద్దరి చేతుల్లో చెరో అయిదూ పెట్టేసి రెండు కలర్ సోడాలు కొట్టిచ్చింది.

వాళ్ళు నీలాల్ని పట్టుకున్నారు. చేతులకి బేడీలేస్తోంటే "ఏటిదీ?" అంది నీలాలు మత్తుగా.

"నువ్వు తాగావు. తప్పు చేశావు. నిన్ను అరెస్టు చేస్తున్నాం—" అన్నాడు పోలీసు.

విరగబడి నవ్వింది నీలాలు.

తప్పు సేసాను-తాగాను, తాగటం తప్పు – ఏది తప్పు – ఏది తప్పుగాదు? దేనికి సిచ్చ? దేనికి సిచ్చనేదు?"

మళ్ళీ మళ్ళీ నవ్వింది నీలాలు.

రామయ్యకు కబురు అందింది. గాలిలా పరుగెత్తుకొచ్చాడు. ఇద్దరు పోలీసుల మధ్య ఉన్న నీలాల్ని ఒళ్ళు తెలియని ఉద్రేకంతో ఆ లెంపా ఈ లెంపా వాయించాడు. నీలాలు కళ్ళు గిర్రున తిరిగాయి. దాని నిషా దిగిపోయింది.

రామయ్య చూస్తూనే దాని కళ్ళు చెరువు లయ్యాయి. నీలాలు కళ్ళలోని నీలాలను రామయ్య చూడలేకపోయాడు.

తన చేతుల్ని బాధగా చూసుకుంటూ "తాగావెందుకే పాపిష్టిదానా" అన్నాడు.

నీలాలు కళ్ళు తుడుచుకుంది.

"పాపిష్టిదాన్నే మావా! తాగాను. ఇంకా తాగుతాను. నీకు తాగినోల్లంటే అనయ్యంగా! నన్ను అసయ్యించుకో. తాగినోల్ల ముకం సూడవుగా! నా ముకం సూడకు." వెక్కి వెక్కి ఏడ్చింది నీలాలు.

మతిపోయి నిలబడ్డాడు రామయ్య.

"నీకు పిచ్చి పట్టిందే నీలాలూ!"

"లేదు మావా! పిచ్చి పట్టలేదు. తాగుతాను మావా! ఎప్పటికీ తాగుతాను నేను—"

రామయ్య ఏదో అనబోతుండగానే పోలీసులు అదిలించారు.

"అడ్డులే! ఠాణాకు తీసుకుపోవాలి."

"ఒగ్గెయ్యండి దొరా! ఇది గోవునాటిది. ఇయ్యాల ఏటయ్యిందో దీనికి? దొరా, ఒగ్గెయ్యండి—"

"వీల్లేదు-కేసు విచారణ అయ్యాక జరిమానా చెల్లించి తీసికెళ్ళు—లేకపోతే జామీనుమీద విడిపించుకో."

వాళ్ళు రామయ్యను పక్కకులాగి ముందుకు కదిలారు.

"ఇంకా నేనెందుకు మావా? తాగుమోతుదాన్ని. ఎవర్నైనా సక్కనిదాన్ని సూసుకో! నీ పూలతోట మద్దెన కాపురం బెట్టుకో! నన్ను మరిచిపో మావా! తాగుమోతు దాన్ని."

"నీలాలూ!"

నోట్లో కండువా కుక్కుకున్నాడు బాధ ఆపుకోవటానికి.

"యెర్రి పీనుగా! నిన్ను మరిసిపోవటమేటే నా పూలతోట నీ కోసం—నేను నీ కోసం—నువ్వు తాగుమోతువి కావే; నాకు తెలుసు. అబద్దవాడతున్నావు. తాగుమోతువయినా ఎవరివయినా నువ్వే కావాలి. నాకు నీలాలే కావాలి. నా నీలాలు నాకు కావాలి"

సగం ఏడుపు, సగంకోపమూ కలిసి మాట్లాడుతున్నాడు రామయ్య

పోలీసులు నీలాల్ని లాక్కుపోతున్నారు.

"బయంనేదే నీలాలూ ! రాజారావు దొర నడిగి నిన్నిడిపిత్తాలే. నీకు బయం నేదు _ వెనుక నుంచి అరిచాడు రామయ్య. అప్పుడే రాజా రావు ఇంటికి పరుగు తీశాడు - రాజారావు పేరు వింటేనే విరగబడి నవ్వింది నీలాలు.

పరుగు పరుగున వస్తోన్న రామయ్యను చూస్తోనే ప్రాణభయంతో వణికిపోయాడు రాజారావు

చంటి పిల్లాడిలా ఏడుస్తూ రెండుచేతులూ జోడించి "నన్ను చంపకు రామయ్యా ; చెయ్యాలని చెయ్యలేదు. అలా జరిగిపోయింది. నాకు తెలి యదు. నాలో అలాంటి పాపిష్ఠి కోరిక ఉందని తెలిస్తే నీలాల్ని ఈ గడ పలో కాలు పెట్టనిచ్చే వాడిని కాను" అన్నాడు. ఒక్క-క్షణం పిండి బొమ్మయి నిలబడిపోయాడు రామయ్య. తప్పతాగి రాజారావు పేరెత్త గానే విరగబడి నవ్విన నీలాలు కళ్ళలో మెదిలింది. దుర్భరమయిన ఆవే దన సహించలేక పోయాడు. "మీరా బాబుగారూ ! మీరేనా ? అయ్యో య్యో ! పూలమొక్క-లకి గొప్పులు తవ్వుకునే గునపం గోడవారని కని పించింది రామయ్యకి. మరొక క్షణంలో ఆ గునపం రామయ్య గుండె ల్లోకి దిగిపోయింది. రక్తపుమడుగులో నిర్జీవంగా రాజారావుగారి కాళ్ళ దగ్గిర పడిపోయాడు రామయ్య.

ఏం జరిగిందో గ్రహించిన రాజారావు నిలువునా వణికిపోయాడు- ఒక్క- క్షణం ఆయన మనస్సు మొద్దుబారిపోయింది. మరుక్షణం ఆయన చైతన్యం ఆయనలో ప్రవేశించింది.

తిన్నగా టెలిఫోన్ దగ్గరకు నడిచారు. పోలీసులకి ఫోన్ చేశారు. పోలీసులు రాగానే తన రెండు చేతులూ అందించాడు.

"వీడిని హత్య చేసింది నేనే !"

రాజారావుని బాగా తెలిసిన పోలీసులు ఆయన చేతులకి బేడీలు తగిలించటానికి సంకోచించారు.

"అదికాదు బాబుగారు—"

"హూ—"

గర్జించాడు రాజారావు.

"నేరం స్వయంగా ఒప్పుకుంటున్నాను తీసికెళ్ళండి."

పోలీసుల వెంబడి నడుస్తూ ఆయన లాకప్‌లో వున్న నీలాల్ని చూడటానికి అనుమతి పొంది వెళ్ళాడు.

ఎర్రాటి కళ్ళతో వెటకారంగా నవ్వుతూ "ఇంకా ఏటి కావాలి బాబూ!" అంది నీలాలు.

"నాకు కావలసింది నువ్వుకాని. ఇంకెవరు కాని ఇవ్వలేరే నీలాలూ? అది మనశ్శాంతి. శాశ్వతంగా ఒక్క క్షణపు దౌర్బల్యంలో దూరమయిపోయింది. నా మనసు నీకు తెలుసనుకొని నిన్ను పనిలో పెట్టుకున్నాను. నాలో నాకే తెలియకుండా యింకెన్నో లోకాలున్నాయని అవి నా బలహీన లక్షణాల్లో నన్ను మింగేస్తాయనీ నాకు తెలీదు. నీకు జరిగిన అన్యాయాన్ని రద్దు చెయ్యలేను. కాని, నీతోపాటు నేనూ శిక్ష అనుభవిస్తున్నానే నీలాలూ. అదే నా క్కాస్త ఊరట!"

నీలాలు దగ్గర్నుండి కదలి వెళ్ళిపోయాడు రాజారావు.

నీలాలు కుళ్ళికుళ్ళి ఏడ్చింది. రాజారావుబాబు మంచోడు. తనకు తెలుసు - కాని -

దానికి అకస్మాత్తుగా గుర్తుకొచ్చింది ఆయన పోలీసుల మధ్య వున్నాడని.

"ఆయన్నెందుకు తీసుకొచ్చినారు" అంది కాపలావాణ్ణి.

"రామయ్య చచ్చి పడివున్నాడు ఈయనింట్లో. ఈయన తనే చంపానని ఒప్పుకున్నాడు, అందుకని అరెస్ట్ చేశారు."

అతని మాటలు ముగిసీ ముగియకుండా కెవ్వున కేకవేసి కింద కూలిపోయింది నీలాలు.